క్లుప్తంగా

రౌడీ షీటర్లు సన్మార్గంలో నడవాలి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్

నందికొట్కూరు: రౌడీ షీటర్లు సన్మార్గంలో నడవాలని టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని వీడాలన్నారు. సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని సూచించారు. మార్పులు జరగకపోతే కఠినంగా వ్యవహరించక తప్పదని హెచ్చరించారు.

వేలం పాటలను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న సీపీఎం,సీపీఐ నాయకులు

నందికొట్కూరు: కొణిదేల గ్రామంలో ఈ నెల 27వ తేదీన భూములకు ఎండోమెంట్ అధికారులు నిర్వహిస్తున్న వేలం పాటలను అడ్డుకుంటామని సీపీఎం, సీపీఐ నాయకులు నాగేశ్వర రావు, శ్రీనివాసులు, ఫక్కీర్ సాహెబ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సర్వే నంబరు 343/1లో 6. 18 ఎకరాల చుక్కల భూమిని ఎండోమెంట్ భూమి అని అధికారులు ఎలా వేలం పాటలు వేస్తారని ప్రశ్నించారు. 2018 డిసెంబరు 26న గ్రామ పెద్దలు ఈ భూమిని బహిరంగంగా వేలం పాటల్లో మల్లేశ్వరమ్మ, లక్ష్మీదేవి అనే ఇద్దరు మహిళలు కలిసి రూ. 20 లక్షలకు పాడి దక్కించుకున్నారని గుర్తు చేశారు. వేలం పాటను అధికారులు ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీల నాయకులు వెంకటేశ్వర్లు, దిలీప్, రంగమ్మ, జయరాణి, హుసేనమ్మ, లక్ష్మన్న, శేఖర్, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో గాయపడిన బుక్కపట్నం వాసులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం ముఖద్వారం సమీపంలో ద్విచక్ర వాహనం రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఆదివారం సాయంత్రం సత్యసాయి జిల్లా బుక్కపట్నంకు చెందిన వీరనారాయణ, కృష్ణ శ్రీశైలం వస్తుండగా ప్రమాదం చోటుచేసుకోగా ఇద్దరూ గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వైద్యం కోసం వైద్యశాలకు తరలించారు.

ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి



ఆధ్యాత్మిక పుస్తకాలను పంపిణీ చేస్తున్న ప్రచారకులు

పాములపాడు: ప్రతి ఒక్కరూ హిందూధర్మ సిద్ధాంతాలను ఆచరిస్తూ భక్తి మార్గంలో నడవాలని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మునిదాసు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పాములపాడులో వారు ఇంటింటికి వెళ్లి పుస్తకాలు పంపిణీ చేస్తూ హిందూధర్మ సిద్ధాంతాలను వివరించారు. వారు మాట్లాడుతూ అన్నింటికి మూలమైనది భక్తిమార్గమన్నారు. నిత్యం హిందూధర్మ సంప్రదాయాల ప్రకారంగా చక్కటి వస్త్రాధారణతో గుడికెళ్లటం, పూజలు చేయడం అలవర్చుకోవాలన్నారు. ఆధునికపోకడలతో హిందూధర్మ సంప్రదాయాలను విస్మరించటం తగదన్నారు. కార్యక్రమంలో కుమార్‌ఆచారి, పుల్లారెడ్డి, నాగమద్దిలేటి, మనోహర్, భాస్కర్, నాగన్న, సంతోష్, గిరిబాబు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, నిధులు విడుదల చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని రాజా వీధిలో పని చేస్తున్న భవన నిర్మాణ కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు అమలు చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చి ఏడాది అయిన సూపర్ సిక్స్ అమలు చేయకుండా జాప్యం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఏసన్న, కార్మికులు శివ, మహబూబ్‌బాషా, బాషా, జయన్న తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి



మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నూతన కమిటీ సభ్యులు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ మరింత పటిష్టానికి, అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇటీవల పార్టీ కమిటీల్లో నూతన సభ్యులుగా ఎంపికైన పలువురు నాయకులు శిల్పాను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి కొండంత బలం. మీ ఆశీస్సులు, అభిమానంతో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్తాం. మీ సహకారాలు మరువలేనివి, పార్టీ అభివృద్ధికి అనునిత్యం కృషి చేస్తున్న మీ ఆదరణ మరువలేనిదన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం యేడాదిలోపే తీవ్ర ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ప్రస్తుతం ఇచ్చిన హామీలేవి అమలవడం లేదని, ప్రభుత్వ మోసాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రతి కార్యకర్తకు పార్టీ, తాను అండగా ఉంటామని, భయపడాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. అంతకముందు పట్టణ విభాగపు మహిళా అధ్యక్షురాలిగా ఎంపికైన దర్గమ్మ, మున్సిపల్ వింగ్ అధ్యక్షురాలు పాణ్యం పార్వతి, వెలుగోడు మండలం యూత్ ప్రెసిడెంట్ సెల్ అధ్యక్షుడిగా ఎంపికైన షంషూర్ అలీ, మున్సిపాలిటీ పరిధిలో ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎంపిన కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు.

శుభకార్యం..

పట్టణంలోని ముబారక్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ 23వ వార్డు నాయకుడు రమీజ్ సోదరి వివాహ వేడుకకు శిల్పా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, షంషూర్, పట్టణ, మండలాధ్యక్షులు సయ్యద్‌మీర్ రాజమోహన్‌రెడ్డి, అంజాద్‌అలీ, వైఎస్ నబీ, కరిముల్లా, షఫీవున్, మరియమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టాన్ని విరమించుకోవాలి



వెలుగోడులో ప్రధాన రహదారికి ఇరువైపులా నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు



ఆత్మకూరులో రోడ్డుకిరువైపులా నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

వెలుగోడు: వక్ఫ్ సవరణ చట్టాన్ని విరమించుకోవాలని ముస్లింలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సవరణను వ్యతిరేకితస్తూ ఆదివారం పట్టణంలో మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు సెంటర్‌లో వందలాది మంది ముస్లిం, మైనారిటీలు మానవహారం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా జాతీయ జెండాలు, నల్లజెండాలను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కమిటీ నాయకులు ఎం.అబ్దుల్ షబ్బీర్, మహబూబ్ రెహ్మాన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వక్ఫ్ సవరణ చట్టం చేయడం దుర్మార్గమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సెక్యులర్ ముసుగులో అధికారంలోకి వచ్చి ముస్లిం సమాజానికి నమ్మక ద్రోహం చేశారని మండిపడ్డారు. స్వాతంత్రం రాకముందు నుంచి ఉన్న వక్ఫ్‌బోర్డ్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ముస్లిం సమాజానికి హాని తలపెట్టేలా సవరణ చేయడం అన్యాయం అన్నారు. వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని కాలరాసేందుకే చట్టం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కమిటీ నాయకులు హిదాయత్ అలీఖాన్, డాక్టర్ జాకీర్ హుసేన్, మోమిన్ అబ్దుల్ రసూల్, ఆరిఫ్ హుసేన్, సాబీర్ పాల్గొన్నారు.

- **ఆత్మకూరు:** వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ పట్టణ ముస్లింలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. స్థానిక కొత్తపేట మసీదు నుంచి నంద్యాల టర్నింగ్, పోలీస్‌స్టేషన్, రఘునాథ్ సెంటర్ మీదుగా గౌడ్ సెంటర్ వరకు ముస్లింలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని నినాదాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వ తీరును నిరసించారు.

నేటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు



నూతనంగా నిర్మించిన గోపాలకృష్ణ స్వామి ఆలయం

వెలుగోడు: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీ గోపాలకృష్ణ స్వామి ఆలయంలో ప్రతిష్ఠాపనోత్సవాలు ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలోని గుంతకందాల గ్రామంలో ఎన్నో ఏళ్లుగా కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రాశస్త్యం పొందిన గోపాలకృష్ణ ఆలయం శిథిలావస్థకు చేరగా.. గ్రామస్తులు, దాతల సహకారంతో పునర్నిర్మాణానికి పూనుకున్నారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రారంభోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. 28వ తేదీ ఉదయం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు గాండ్ల శివన్న, వెంకటరమణ, పాపన్న, శ్రీనివాసులు, నారాయణ, సుబ్బరాయుడు ఏర్పాట్లు చేస్తున్నారు. 26న గణపతి పూజ, యాగశాల ప్రవేశం, గోపూజ, దీక్షా వస్త్రాధారణ, నవగ్రహ కలశ స్థాపన, మండల దేవతా ఆరాధన ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు సాయంత్రం జాలాదివాసం, మత్స్య గ్రహణం , అంకురార్పణం, దీక్షా హోమం కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 27న ప్రభాత పూజాదులు, మూలమంత్ర, యంత్ర జపములు, హోమాలు, గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 28న శ్రీ వినాయక, సరస్వతీ దేవి, గరుత్మంతుడు, ఆంజనేయ స్వామి, శ్రీ గోపాలకృష్ణ స్వామి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేపడతారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

దంచికొట్టిన వర్షం



వీరాపురం గ్రామంలో రోడ్డుపై నిలిచి వర్షపు నీరు

కొత్తపల్లి: మండలంలో ఆదివారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. మండలంలోని కపిలేశ్వరం, ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, సింగరాజుపల్లె, శివపురం, లింగాపురం, జడ్డువారిపల్లె, గోకవరం, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, బావాపురం, వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాలతో పాటు మండల కేంద్రం కొత్తపల్లిలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వీరాపురం గ్రామంలో ఎస్సీకాలనీ, కొత్తపల్లి, గువ్వలకుంట్ల ప్రధాన రహదారిలో వర్షపునీరు నిలిచింది. గువ్వలకుంట్ల గ్రామంలో ఎస్సీకాలనీలో రోడ్లు జలమయం అయ్యాయి. ఆత్మకూరు- సంగమేశ్వరం ప్రధాన రహదారిలో ఎం. లింగాపురం గ్రామంలో రోడ్డుపై నీరు నిలిచి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సివచ్చింది. బట్టువారిపల్లె గ్రామంలో ఓ టెంకాయ చెట్టు ప్రధాన విద్యుత్ తీగలకు తగడంలో ఎప్పుడు పడిపోతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. విద్యుత్ అధికారులకు సమాచారమిచ్చిన స్పందించలేదని గ్రామస్తులు తెలిపారు. ప్రమాదం జరగక ముందే స్పందించాలని కోరుతున్నారు.

పొట్టేలు అపహరణ

జూపాడుబంగ్లా: దేవునికోసం పెంచుకుంటున్న పొట్టేలును గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున అపహరించిన ఘటన మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గోపిరెడ్డి సుంకులమ్మదేవతను చేసేందుకు రెండేళ్లుగా పొట్టేలును పెంచుకుంటున్నాడు. శనివారం రాత్రి పొట్టేలును ఇంట్లోని షెడ్డులో ఆవులతో పాటు కట్టేశాడు. తెల్లవారిన తర్వాత చూస్తే షెడ్డులోని పొట్టేలు కనిపించకపోవటంతో అతను లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. దేవునికోసం వదిలిన రూ.30వేల విలువైన పొట్టేలును గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లినట్లు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు బాబూ?

వెలుగోడు: అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా, నిరుద్యోగ భృతి గురించి ప్రస్తావించకుండా నిరుద్యోగులను సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు షంషీర్ అలీ విమర్శించారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని కలిసి తనను మండల యువజన విభాగం అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు కతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి కోసం యువత ఎదురు చూస్తోందన్నారు. జాబ్ క్యాలెండర్‌పై గంపెడాశలు పెట్టుకున్న యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో మూడుసార్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు.. మళ్లీ బూటకపు హామీలతోనే అధికారంలోకి వచ్చి తన పంథాను మార్చుకోవడం లేదన్నారు. ఇచ్చిన మాటను అమలు చేయకపోవడమే ఆయన నైజమన్నారు.

పెళ్లికావడం లేదని యువకుడి ఆత్మహత్య

బొమ్మలసత్రం: తనకు వివాహం కావడం లేదని రాముడు (29) అనే యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన వివరాలు టూటౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన మేరకు.. నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సుగునమ్మ కుమారుడు రాముడు పట్టణంలోని ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులు నిర్వహించుకుని రాత్రి హోటల్‌పైన ఉన్న తన గదిలోకి వెళ్లి పోయాడు. ఏమైందో ఏమో తెలియదు కానీ అదేరోజు రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి గది నుంచి దుర్వాసన రావటంతో హోటల్ యజమాని రాముడు గది తలుపులు బద్దలు కొట్టి చూడగా మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ఈఓ చంద్రుడు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉమామహేశ్వరులకు అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు సుందరంగా ముస్తాబు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు.



చిన్న కోనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు

భక్తులతో మహానంది కిటకిట

మహానంది: క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వేలాది మంది భక్తజనం తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ తగ్గలేదు.మూడు రోజుల నుంచి వేలాదిగా తరలివస్తున్న భక్తులతో దేవస్థానానికి చెందిన తక్కువగా ఉన్న వసతి గృహాలు నిండిపోతుండటంతో ప్రైవేట్ లాడ్జీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు లాడ్జీల నిర్వాహకులు అధిక మొత్తం వసూలు చేస్తున్నారని భక్తులు వాపోయారు. దేవస్థానం, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి నిర్ణీత ధరలు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పెద్దమ్మ అమ్మవారికి బోనాలు తెస్తున్న మహిళలు

పెద్దమ్మకు బోనాల సమర్పణ



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: మండలంలోని గోపవరం గ్రామంలో పెద్దమ్మ విగ్రహ, నాభిశిల ప్రతిష్ఠ మహోత్సవాలు పూర్తయి 41 రోజులైన సందర్భంగా ఆదివారం గ్రామంలో వేడుకలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు ఉదయం నుంచే పెద్దమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వేడుకల సందర్భంగా శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి గ్రామానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అలుగు వంతెన నిర్మించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు రమేష్‌బాబు

జూపాడుబంగ్లా: శ్రీశైలం బ్యాక్‌వాటర్‌పై సిద్ధేశ్వరం వద్ద నిర్మించనున్న తీగల వంతెనకు బదులుగా అలుగుతో కూడిన వంతెన నిర్మించాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జూపాడుబంగ్లాలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. రాయలసీమ రైతాంగ నాయకులు చేపట్టిన సిద్ధేశ్వరం అలుగు నిర్మాణ ఉద్యమానికి సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం కోల్పోయిన నందికొట్కూరు నియోజకవర్గం ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించటం తగదన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు భూమికి బదులు భూములు, రూ.లక్షల్లో నష్టపరిహారంతో పాటు రాజధానిలో ఇళ్ల స్థలాలు కేటాయించిన సీఎం చంద్రబాబునాయుడు శ్రీశైలం ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, సర్వస్వం సమర్పించిన నీటిముంపు నిర్వాసితులపై వివక్షత తగదన్నారు. ఎన్నికల సమయంలో నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో మాట్లాడుతూ తాను సీఎం అయిన వెంటనే జీవో 98ప్రకారం 674 మందికి ఉద్యోగ అవకాశాలు కలిప్తామని నమ్మబలికి ఏడాది కావొస్తున్నా ఉద్యోగాలివ్వకపోవటం సిగ్గుచేటన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే ఉద్యోగాలిచ్చి నీటి ముంపు నిర్వాసితులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సిద్ధేశ్వరం అలుగు నిర్మాణ సాధనకై ఈనెల 31న చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మద్దతునిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మగ్బుల్‌బాషా, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ హైస్కూల్‌లో ఆదివారం ఆ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. అలాగే పాఠశాలలో చదువుకొని 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా 2001 సంవత్సరం నుంచి 2018 వరకు పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు సిల్వర్‌జూబ్లీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాలలో వారి అనుభవాలు, అనుభూతులు, ప్రస్తుతం వారి పరిస్థితులను ఉపాధ్యాయులతో కలసి పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు మల్లయ్య, లాలన్న, నాగన్న, రఘురాం, నీలకంఠం, రమణారెడ్డి, వేణుగోపాల్, ఉషేన్‌బాషా, శివశాంక్, సుజాత, శ్రీలక్ష్మీలను దుశ్శాలువా, మెమొంటోలతో సన్మానించారు. అంతకు మునుపు పూర్వ విద్యార్థులు పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రైతుబజార్



ఆత్మకూరులో రైతు బజారును చూపుతూ మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని మార్కెట్‌యార్డులో రూ.65 లక్షలతో నిర్మించిన రైతు బజారు నిరుపయోగంగా మారిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్, పట్టణ నాయకులు రామ్‌నాయక్,వ ఈరన్న, ప్రాతకోట భాస్కర్ అన్నారు. ఆదివారం నిరుపయోగంగా ఉన్న రైతు బజారును పరిశీలించారు. వారు మాట్లాడుతూ లక్షలాది రూపాయలు వెచ్చించినప్పటికీ రైతులకు ఉపయోగపడకపోవడం విడ్డూరమన్నారు. 2021 జూలై 8న ప్రారంభించినప్పటికీ నేటికీ వినియోగంలోకి రాలేదని, ఇంకెన్నడు తీసుకొస్తారని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు ప్రజోపయోగానికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓంకార క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామివారి దర్శనం కోసం ఆలయంలో నిరీక్షిస్తున్న భక్తులు

బండి ఆత్మకూరు : మండలంలోని గంగా, ఉమా సమేత ఓంకారేశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు పంచముగ్గల కోనేరులో పుణ్యస్నానాలు చేసి ఓంకార సిద్ధేశ్వర స్వామిని, అమ్మవారిని దర్శించుకొని పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే.. వ్యాస మహర్షి ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నల్లమల కొండపై ప్రతిష్ఠించిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కాలినడకన వెళ్లి సందర్శించారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



తాటి చెట్లే మేఘాలను మోస్తున్నట్టుగా..



నీటి మబ్బులు..అందుతాయనేంతగా..

ప్రకృతి పరవశమాయే!

మహానంది: వర్షాకాలంలో వినీలాకాశం అద్భుతంగా గోచరిస్తుంది. ఆ దృశ్యాలు వీక్షకులను అలా కట్టిపడేస్తాయంతే. నీలి ఆకాశం మబ్బులు కమ్మేస్తుంటే.. చినుకు రాల్చేందుకు మేఘాలు ఉవ్విళ్లూరడం.. వర్షించండంటూ గాలి జత కట్టిన వేళ కమ్ముకొస్తున్న కారుమేఘాలు కరిగిపోయేందుకు తపించిపోయాయి. ఉదయం వేళలో నీలివర్ణపు ఆకాశంలో దూది పరుపుల్లా తెల్లగా కనిపించిన మేఘాలు... సాయంసంధ్య వేళలో మబ్బులను మోసుకొస్తూ సందడి చేశాయి. ఈ దృశ్యాలు మండలంలోని నందిపల్లె, గోపవరం, అబ్బీపురం గ్రామాల సమీపంలో ఆదివారం ఆవిష్కృతమవగా సాక్షి కెమెరాలో బంధించింది.